క్లుప్తంగా

పోలీస్ స్టేషన్ తనిఖీ

పెద్దతిప్పసముద్రం : స్థానిక పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం మదనపల్లి డీఎస్పీ కేశప్ప అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మండలంలో రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని, శాంతి భద్రతలను పరిరక్షించాలన్నారు. రాత్రి వేళ గస్తీ నిర్వహించాలని ఎస్‌ఐ రవీంద్రబాబును ఆదేశించారు. అనంతరం ఇటీవల నమోదైన ఫోక్సో కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఓటరు నమోదుపై ప్రచారం

కలికిరి : ఓటరు నమోదు, చేర్పులు, మార్పులు అవకాశంపై శుక్రవారం మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. శని, ఆదివారాల్లో మండల పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్‌లలో బీఎల్‌ఒలు అందుబాటులో ఉంటారని, 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదుకు తగిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించి నమోదు చేసుకోవచ్చని తహసీల్దారు భాగ్యలత తెలిపారు.

కేంద్ర పథకాలపై సంకల్ప యాత్ర

బి.కొత్తకోట: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై శుక్రవారం మండలంలోని బండారువారిపల్లె, గోళ్లపల్లె పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డీఎల్‌డీఓ లక్ష్మీపతి మాట్లాడుతూ ప్రపంచంలో భారత్ అగ్రగామి కావాలన్న లక్ష్యంతో కేంద్రప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతోందన్నారు. మహిళలకు ఉజ్వల పథకం కింద గ్యాస్ స్టవ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర, సర్పంచులు ఉజ్జయిని సాంబశివ, పుష్పలత, ఎంపీటీసీ విమలమ్మ పాల్గొన్నారు.

మంత్రికి వినతి

కేవీపల్లె : మండలంలోని కొన్ని గ్రామాలకు నూతన తారు రోడ్లు కావాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మండల నాయకులు విన్నవించారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, నాయకులు రామకొండారెడ్డి, రవి, హరిబాబు శుక్రవారం పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లెలో మంత్రిని కలిశారు. మండలంలో రోడ్లు కావాల్సిన గ్రామాల గురించి మంత్రికి విన్నవించారు.

అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి

బి.కొత్తకోట: బి.కొత్తకోట నగర పంచాయతీలో అభివృద్ధి, ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని కమిషనర్ పీఆర్. మనోహర్ అన్నారు. శుక్రవారం కాళికమ్మ గుడి వీధి–కొత్తపేట వీధిని కలిపే కాలువ, సిమెంటు రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రూ.2 కోట్లతో మురుగు నీటి కాలువలు, సిమెంటు రోడ్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇవికాక ఐదు సచివాలయాలకు రూ.కోటి నిధులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా మంజూరు చేయించారని చెప్పారు.

నూతన నియామకం

పీలేరు రూరల్ : వైఎస్సార్‌సీపీ పీలేరు మండల ఉపాధ్యక్షులుగా ఎస్.ఎల్.వి. సంజీవయ్య, ఎస్. షాజహాన్‌ను నియమించినట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. పీలేరు పట్టణానికి చెందిన వీరిద్దరూ కొన్నేళ్లుగా వైఎస్సార్‌సీపీ అభివృద్ధి చేస్తున్న కృషిని అభినందిస్తూ పార్టీ ఉపాధ్యక్ష పదవులు కల్పించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

గృహ నిర్మాణాలకు స్థలం కేటాయించండి

కలకడ : మండలంలోని ప్రతి నిరుపేదకు జగనన్న కాలనీలో ఇల్లు మంజూరై స్థలం లేనివారికి వెంటనే ప్రభుత్వ భూమిని కేటాయించి చూపించే బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని ఎంపీ పీఏ రాజు, ఎంపీపీ శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు కలకడ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రదీప్ తో ఇళ్ల స్థలాలపై చర్చించారు. అర్హత కలిగిన వారు కలకడ-300, బాలయ్యగారిపల్లె-250, కె.బాటవారిపల్లె-270, కోన, నడిమిచెర్ల తదితర పంచాయతీల్లో ఇంటి నిర్మాణం కోసం స్థలం కావాలని ప్రజాప్రతినిధులను కోరినట్లు తెలిపారు.

విధుల బహిష్కరణ

వాల్మీకిపురం : ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఏపీ ల్యాండ్ టైట్లింగ్ నిరసనగా స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి, నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద కుమార్ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టును వెనక్కి తీసుకోవాలన్నారు. జిల్లా న్యాయవాదులు ఫెడరేషన్ పిలుపు మేరకు ఈ నెల 1వ తేది నుండి 15వ తేది వరక విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యం

పీలేరురూరల్ : గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టినట్లు సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. యర్రగుంట్లపల్లెలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్పంచ్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ అమరనాథరెడ్డి, ఉప సర్పంచ్ బుల్లెట్ శేఖర్, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణతో ఆరోగ్యవంతమైన సమాజం

మదనపల్లె : ఎయిడ్స్ నివారణతో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిద్దామని వైద్య సిబ్బంది పిలుపునిచ్చారు. లైంగిక జీవితంలో అరక్షిత శృంగారం, వ్యాధిగ్రస్తుల రక్తం మరొకరికి ఎక్కించడం, మత్తుమందులకు అలవాటుపడటం తదితర కారణాలతో వచ్చేటువంటి ఎయిడ్స్ భూతాన్ని సమూల అంతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మేజిస్ట్రేట్ ఐ.ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీ, బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి వైద్య సిబ్బంది, బీటీ ప్రభుత్వ డిగ్రీకళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, శ్రీనివాసడిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో మేజిస్ట్రేట్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ... ఎయిడ్స్ నివారణకు ప్రభుత్వం, జిల్లా ఆస్పత్రి, ఐసీటీసీ సిబ్బంది, స్వచ్ఛందసంస్థలు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి ఆర్ఎంఓ ప్రసాదరాజు, ఐసీటీసీ జయకుమార్, పుల్లయ్య, డీపీఎంఓ వేణుగోపాల్, ఎస్‌టీఎస్ ప్రభాకర్, బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గోపతిబాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లె: ర్యాలీ నిర్వహిస్తున్న మేజిస్ట్రేట్ ప్రవీణ్‌కుమార్, వైద్యసిబ్బంది



గుర్రంకొండలో ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు, వైద్య సిబ్బంది

ఎయిడ్స్ మహమ్మారిని నిర్మూలిద్దాం

నిమ్మనపల్లె : సమాజంలో ప్రతి ఒక్కరు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి, వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు కృషిచేద్దామని మెడికల్ ఆఫీసర్ రమేష్‌బాబు, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణయ్య అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నిమ్మనపల్లెలో వైద్యాధికారులు, జూనియర్ కళాశాల విద్యార్థులు ఉమ్మడిగా ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు.

ఎయిడ్స్ నియంత్రణకు సమష్టి కృషి అవసరం

పీలేరు రూరల్ : ఎయిడ్స్ నియంత్రణకు సమష్టి కృషి అవసరమని స్థానిక ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వర సురేంద్ర, డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ కార్తీక్‌కుమార్, కోర్ సంస్థ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలతో ఎయిడ్స్ దూరం

వాల్మీకిపురం : సరైన జాగ్రత్తలను పాటించడం ద్వారా ఎయిడ్స్ మహమ్మారి నుంచి దూరంగా ఉండవచ్చని స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఫైరోజా బేగం అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అలాగే పివిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఉమా అమరేశ్వరి, ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి, చింతపర్తి పిహెచ్‌సి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు.

గర్నిమిట్టలో..

కేవీపల్లె : హెచ్ఐవీ సోకిన వారి పట్ల సానుభూతి చూపాలని గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రేష్మ అన్నారు. శుక్రవారం మండలంలోని గర్నిమిట్టలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. సమాజ భాగస్వామ్యంతోనే ఎయిడ్స్ నియంత్రణకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో భాగ్యలక్ష్మీ, పీహెచ్ఎన్ రమాదేవి, సూపర్‌వైజర్లు రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ : మండలకేంద్రంలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక తెలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ సాగింది.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

కలకడ : ఎయిడ్స్ నివారణపై ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ మల్లికార్జున, కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్‌దినోత్సవం సందర్భంగా కలకడ, ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలో పాపిరెడ్డిగారిపల్లెలో ఆశావర్కర్లు, ఆరోగ్యసిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. కలకడ కృషి సంస్థ మేనేజర్ శ్రీనివాసులు, సిబ్బంది ధనలక్ష్మి, జాబీద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక రంగసముద్రంరోడ్డు నుంచి జ్యోతిచౌక్, పీటీఎంరోడ్డు మీదుగా ర్యాలీ జరిగింది. వైద్యారోగ్యశాఖ ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, జూనియర్ కళాశాల విద్యార్థులు ప్లకార్డులతో పాల్గొని ఎయిడ్స్ వ్యాప్తిని అరికడదా-ఎయిడ్స్ రహిత సమాజం నిర్మిద్దాం అంటూ నినాదాలు చేశారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపొద్దు

తంబళ్లపల్లె : ఎయిడ్స్ బాధితుల పట్ల ఎవ్వరూ వివక్ష చూపొద్దని న్యాయమూర్తి ఉమర్ ఫారూఖ్ అన్నారు. శుక్రవారం కోర్టులో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులకు అండగా నిలవాలన్నారు. అలాగే ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా తంబళ్లపల్లెలో విద్యార్థులు, సంఘాల ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు.

పెద్దమండ్యం : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కలిచెర్లలో శుక్రవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కలిచెర్ల జూనియర్ కళాశాల విద్యార్థులు ప్ల కార్డులతో పురవీధులలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణపై విద్యార్థులు నినాదాలు చేశారు.

ములకలచెరువు: మండల కేంద్రంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు కలసి ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ చేపట్టారు. మూడు రోడ్ల కూడలిలో వైద్యాధికారి జాహ్నవిరెడ్డి ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు.

సంక్షేమ సారథిని మరోసారి ఆశీర్వదించండి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : సంక్షేమ సారథిని మరోసారి ఆశీర్వదించండని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని తలపుల పంచాయతీ రెడ్డెన్నగారిపల్లె, చిల్లావాండ్లపల్లె, కొండూరువాండ్లపల్లె, అప్పిరెడ్డిగారిపల్లె, చెరువుకాడఇండ్లు, రాజువారిపల్లె, మేళ్లచెరువు ఎరుకులపాళెం, మిథులానగరంలో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభత్వం కొన్ని వర్గాలకు, వారి అనుచరులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందించేదని తెలిపారు. అదే మన జగనన్న ప్రభుత్వం పార్టీలు, వర్గాలు చూడకుండా అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పథకాలు నేరుగా లబ్ధిదారునికే పారదర్శకంగా అందించి ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించిన ఘనత జగన్‌దేనని తెలిపారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

అనంతరం గూడరేవుపల్లెలో పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా 77 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు శిరీషా, జగన్‌మోహన్‌రెడ్డి, చిన్నకొండయ్య, ఎంపీటీసీలు కిరణ్‌కుమార్ నాయుడు, వెంకటరమణ నాయుడు, నాయకులు అమరనాథరెడ్డి, మల్లికార్జున రెడ్డి, చక్రపాణిరెడ్డి, మస్తాన్, చలపతి, హరిబాబు, రాజన్న, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

ములకలచెరువు : ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని ఎంపీపీ సాయిలీలా అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల మీట్ నిర్వహించారు. మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఈ నెల 2, 3 తేదీల్లో ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. చౌడసముద్రం సర్పంచ్ రాంబాబు నాయుడు మాట్లాడుతూ జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సభా దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే సిబ్బంది రాత్రి వేళ రోగులకు అందుబాటులో ఉండటం లేదని పలువురు ప్రజా ప్రతినిధులు డాక్టర్ జాహ్నవీరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన లబ్ధిదారులు పక్కాగృహం మంజూరుకు దరఖాస్తు చేసుకోవచ్చని హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఎంపీడీఓ అశ్వినీ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించే దిశగా ఆయా శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు సిద్దారెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు మేరమ్మ,మండల, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సాయిలీలా

యూటీఎఫ్ నూతన కార్యవర్గం

మదనపల్లె సిటీ : మదనపల్లె అర్బన్, రూరల్ మండలాలకు యూటీఎఫ్ నూతన కమిటీలను ఎన్నుకున్నట్లు యూనియన్ జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా భానుమూర్తి, సహా అధ్యక్షులుగా శీనప్ప, భార్గవి, ప్రధాన కార్యదర్శిగా హరికృష్ణ, ట్రెజరర్‌గా షైని, కార్యదర్శులుగా హస్సన్‌భాష, మునిరాజా, అంజనప్ప, జులాన్‌బాషా, ఉదయ్‌కుమార్, జిల్లా కౌన్సిలర్లుగా వెంకటరమణ, సుధాకర్, రామాంజనేయులు ఎన్నుకున్నారు. మదనపల్లె మండల కమిటీ గౌరవ అధ్యక్షులుగా విజయ్‌కుమార్, అధ్యక్షుడిగా రవీంద్ర, సహాధ్యక్షులుగా సఫీవుల్లా, పద్మావతమ్మ, ప్రధాన కార్యదర్శిగా మల్లేశ్వరబాబు, ట్రెజరర్‌గా గంగులప్ప, కార్యదర్శులుగా బాబునాయక్, సురేంద్ర, జిల్లా కౌన్సిలర్లను ఎన్నుకున్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

పీలేరు రూరల్ : గ్రామ పంచాయితీ పరిధిలో ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు సర్పంచ్ జీనత్ షఫీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కామాటంవారిపల్లె నుంచి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. అలాగే మరమ్మతులకు గురైన వీధిలైట్లు తొలగించి కొత్త లైట్లు ఏర్పాటు చేపించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. దోమల నివారణ ఫాగింగ్ చేపిస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మాజీ సర్పంచ్ హుమయూన్, వార్డు మెంబర్లు రమణ, హబీబ్‌బాషా, నాయకులు పెద్దోడు, ఆనంద, షాకీర్, జావిద్ ఈవో ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేయడం పౌరులుగా బాధ్యత

– ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : దేశ పౌరులుగా ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవడం మనందరి బాధ్యత అని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. శుక్రవారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వలసపల్లె పంచాయతీ ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరుతూ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మురళీ మాట్లాడుతూ.. మెరుగైన సమాజ నిర్మాణంలో ఓటు హక్కు కీలకమన్నారు. అందుకే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓటుహక్కు పౌరులందరికీ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అన్నారు. కార్యక్రమంలో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి, తహసీల్దార్ మహబూబ్‌చాంద్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

కలకడ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని నుగొండపాళ్యెం సచివాలయం పరిధిలోని దిగుపాళ్యెంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు, పథకాల లబ్ధిని వివరించే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల , మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌నాయుడు, సచివాలయాల కన్వీనర్ మోహన్‌రాజ్, సింగల్‌విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, హరినాథ రెడ్డి, మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు, జివి కిషోర్, డాక్టర్ సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

గుర్రంకొండ: మండలంలో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ బహిరంగ సభలో రూ.10,700 రికవరీ చేయాల్సిందిగా తనిఖీ అధికారులు ఆదేశించారు. ఈసందర్భంగా ఏపీడీ ప్రతాప్ మాట్లాడుతూ మండలంలో 2022–23 సంవత్సరానికి సంబంధించి మొత్తం 812 పనులు ఉపాధిహామీ పథకం కింద చేపట్టినట్లు తెలిపారు. అనంతరం పంచాయతీల వారీగా సామాజిక తనిఖీ వివరాలు వెల్లడించారు. చెర్లోపల్లెలో అంగన్‌వాడీ టీచరు పనివేళల్లో 40 రోజుల పాటు ఉపాధి హామీ పనులు చేసినట్లు వెల్లడించారు. పనివేళల్లో ఆమె అన్ని రోజుల పాటు ఎలా ఉపాధి హామీ పనులు చేశారంటూ అధికారులు ప్రశ్నించారు. మస్టర్లలో బినామీ పేర్లతో బిల్లులు చేసుకొని డబ్బులు స్వాహా చేశారని వివరించారు. జిల్లా విజిలెన్స్ అధికారి ప్రకాష్, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి ఉమామహేశ్వర్, జెడ్పీటీసీ సమ్రీన్‌ముక్తియార్, ఎంపీడీఓ వెంకటేశులు, ఈవోపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, ఏపీవోలు జయరామిరెడ్డి, రెడ్డిజవహర్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం : స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో శుక్రవారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామి వారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో సాంప్రదాయ బద్ధంగా తీసుకెళ్లి ఆశీనులను చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారి కృష్ణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

82 శాతం పెన్షన్లు పంపిణీ

పీలేరు : వైఎస్సా పెన్షన్ కానుక కార్యక్రమంలో భాగంగా మండలంలో మొదటి రోజు 82 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలో మొత్తం 9855 పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉండగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒకట్రెండు రోజుల్లో వందశాతం పూర్తి చేస్తామని చెప్పారు.

వర్షంలోనూ పింఛన్, బియ్యం పంపిణీ

కలకడ : ఒకటో తేదీ రాగానే ఠంచన్‌గా పింఛన్, ఇంటి ముంగిటకే బియ్యం నిత్యవసర సరుకులు అందుతున్నాయి. శుక్రవారం ఉదయం 5.30 గంటల నుంచి వలంటీర్లు లబ్ధిదారులకు ఇళ్ల వద్దకు వెళ్లి వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా పింఛన్లు అందజేశారు. మండలంలోని 96 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు.



ములకలచెరువు: పింఛన్ అందజేస్తున్న వలంటీర్

తలుపు తట్టి అందజేత

ములకలచెరువు : మండలంలో లబ్ధిదారులకు శుక్రవారం వేకువజాము నుంచే వలంటీర్లు తలుపుతట్టి పింఛన్లు అందజేశారు. మొదటి రోజు 80శాతం పింఛన్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ అశ్విని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఏపీఆర్‌జేసీ విద్యార్థులు

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చెన్నకేశవులు తెలిపారు. శుక్రవారం ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఎ. హర్ష ఈ నెల 16న కర్నూలు బీ క్యాంప్ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 19 హ్యాండ్‌బాల్ విభాగంలో విశేష ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే మొదటి సంవత్సరం బైపీసీ చదువుతున్న సుదర్శన్ శ్రీనివాస్ ఈ నెల 25న విజయనగరంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర 19 ఆర్చరీ విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో పీడీ నరేంద్రబాబు, అధ్యాపకులు పాల్గొని అభినందించారు.

స్థల కేటాయింపులో ఎమ్మెల్యేపై ఆరోపణలు తగవు

మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి

మదనపల్లె : మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీలో ది మదనపల్లె లారీ ఓనర్స్ అసోసియేషన్ కోసం అవసరమైన స్థలానికి ప్రభుత్వ నిబంధనల మేరకే దరఖాస్తు చేసుకుని, మార్కెట్ వాల్యూ చెల్లించి తీసుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, అసోసియేషన్ సెక్రటరీ మహబూబ్‌పీరా అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మీడియాతో మాట్లాడుతూ... లారీ అసోసియేషన్‌కు అధ్యక్షులుగా ఉన్నటువంటి ఎమ్మెల్యే నవాజ్‌బాషా... అసోసియేషన్ పేరుతో ప్రభుత్వస్థలాన్ని కబ్జా చేశారని, సోషల్ మీడియా, పీడీఎఫ్ పత్రికల్లో కొందరు పనిగట్టుకుని ప్రచారం చేయడం, చౌకబారు విమర్శలు చేయడం తగదన్నారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలం కేటాయిస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుందని, దాదాపు 25 ఏళ్లగా ప్రతి ప్రజాప్రతినిధిని, ప్రభుత్వాలకు విజ్ఞప్తిచేస్తూనే ఉన్నామన్నారు. లారీ యజమానుల కష్టాలను స్వయంగా చూసిన ఆయన ఈ విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, జిల్లాకలెక్టర్, ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లి నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలాన్ని మార్కెట్ విలువకు కొనుగోలు చేసేందుకు దరఖాస్తు చేసుకోవడం జేశామన్నారు. సమావేశంలో లారీ అసోసియేషన్ ట్రెజరర్ సుధాకరనాయుడు, సభ్యులు ఖలీం, సమీ, షౌకత్, ప్రసాదరెడ్డి, సమీవుల్లా, హసేన్ బాషా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

- చంద్రబాబుది నయవంచక బుద్ధి
- మరోమారు జగన్‌ను ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే నవాజ్‌బాషా

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం

మదనపల్లె : జగనన్న పాలనలో జరుగుతున్న అభివృద్ధి, అందుతున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని 17వవార్డు, 35వవార్డు, మండలంలోని కొండామారిపల్లె సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీం అస్లాం, పట్టణ కన్వీనర్లు జింకాచలపతి, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్‌లు హాజరయ్యారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే బ్రోచర్స్‌ను ఆవిష్కరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ.. 2014 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు 600 అబద్ధపు హామీలను గుప్పించి, అధికారంలోకి వచ్చాక ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. మేనిఫెస్టోనే కనిపించకుండా మాయం చేసి ప్రజలను నట్టేట ముంచారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫాతిమాబీ, ఎంపీటీసీ నీరుగట్టిమేరీ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ జీ.వెంకటరమణ, డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, వెలుగుచంద్ర, సిద్దలవేమారెడ్డి, ఇస్మాయిల్, గుండ్లూరురఫీ, షరీఫ్, జేసీఎస్ కన్వీనర్లు పోతబోలునాగరాజ, మునిశేఖర్, బావాజీ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లె: సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించిన ఎమ్మెల్యే నవాజ్‌బాషా



వాల్మీకిపురం: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేద్దాం

నిమ్మనపల్లె : ప్రజలందరికీ కుల, మత,వర్గ, పార్టీ భేదాలు లేకుండా మేలు చేసిన జగనన్నను 2024లో శాసనసభ ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని వెంగంవారిపల్లె సచివాలయం వద్ద మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సదాశివరెడ్డి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, సర్పంచ్ జి.శ్రీవాణిలతో కలిసి సంక్షేమపథకాల డిజిటల్‌బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచులు సుబ్రహ్మణ్యం, ఉషారాణి, కోఆప్షన్ సభ్యులు మహమ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమానికి ప్రాధాన్యత

గుర్రంకొండ: జగనన్న పాలనలో నిరుపేదల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని జెడ్పీటీసీ సమ్రీన్‌ముక్తియార్ అన్నారు. శుక్రవారం ఎలుట్ల సచివాలయాల్లో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందకు కావాలంటే అన్న కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సచివాలయాల దగ్గర వాటి పరిధీలో జగనన్న ప్రభుత్వం ఇప్పటి వరకు వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా ఎంత మేరకు నిధులు ఇచ్చారో డిజిటల్ బ్యానర్ ద్వారా ప్రదర్శించారు. సచివాలయం దగ్గర వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజగోపాల్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు శివారెడ్డి పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా పాలన

వాల్మీకిపురం : దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సువర్ణపాలన అందిస్తున్నారని వైస్ ఎంపీపీలు వెంకట్రమణ, కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతపర్తిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నీళ్ళభాస్కర్, రాయుడు, ఓరుగంటి రమేష్ బాబు, లక్ష్మీనారాయణ రెడ్డి, నల్లంకి నరసింహులు, మోహన్ రెడ్డి, అబ్దుల్ కలీమ్, ఆనంద, మెంబరు శీనా, ప్రియరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసం జగనన్న కృషి

పెద్దమండ్యం : పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని జెడ్పీటీసీ పీరమ్మ అన్నారు. మండలంలోని ముసలికుంట గ్రామ సచివాలయయం వద్ద శుక్రవారం వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ బోర్డును అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టి జయచంద్రారెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, గ్రామ సర్పంచ్ జయమ్మ, పంచాయతీ కార్యదర్శి రెడ్డిప్రసాద్, మండల పార్టీ కన్వీనర్ చాంద్ బాషా, రెడ్డెప్పరెడ్డి, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

పెద్దతిప్పసముద్రం : అర్హతే ప్రామాణికంగా జగనన్న సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారని ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న, డ్రిప్ రమణ అన్నారు. శుక్రవారం అంకిరెడ్డిపల్లిలో సర్పంచ్ భాగ్యమ్మ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి యోగానంద్, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌వలి, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, శివారెడ్డి, వెంకట్రమణారెడ్డి, రవికుమార్, నారాయణ, సుబ్బరాం,వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే సీఎం కావాలి

కురబలకోట : రాష్ట్ర ప్రగతికి, ప్రజల మరింత అభివృద్ధికి మళ్లీ జగనే సీఎం కావాల్సిన ఆవశ్యకత అవసరం ఉందని ఎంపీపీ బి.దస్తగిరి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. కనసానివారపల్లెలో శుక్రవారం సర్పంచ్ ఆర్కే కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఆర్సీ ఈశ్వర్ రెడ్డి, ఎం. ఆనందరెడ్డి, అమరనాథరెడ్డి, వన్ను కొండారెడ్డి, మొలక గోపాల్ రెడ్డి, సిద్దల ఉదయ్ కుమార్ రెడ్డి, రాజశేఖర్, రెడ్డి శేఖర్, బాలకృష్ణ, హరి, క్రిష్ణ పాల్గొన్నారు.

గుంతావారిపల్లెలో..

బి.కొత్తకోట : సీఎంగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే కావాలని శీలంవారిపల్లె సర్పంచు భీమగాని నాగిరెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం గుంతావారిపల్లెలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ శివకవి గోపాలు, గృహసారథులు శోభ, జనార్దనరెడ్డి, నాయకులు పి.కృష్ణారెడ్డి, బి.కృష్ణారెడ్డి, డి.వెంకటరమణ పాల్గొన్నారు.